
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS

డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 147 | ది.11-9-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 147 | Date : 11-9-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

**8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి**

- వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర
- కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి
- రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి
- జిల్లాకు 25, నియోజకవర్గానికి 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి
- మభ్యపెట్టే విధంగా కాదు... వాస్తవ నివేదికలు కావాలి
- కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి
- సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్






**అమరావతి,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపా లన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.




**టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి..** "ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్థ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. డీప్ టెక్ గవర్నెన్స్ ఉంటే అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీని వినియోగించడం ద్వారా డేటా లేక్, అవేర్ లాంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం పెరగాలి... సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 ఏళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15 ఏళ్లలోనే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాలజీ అందుబాటులో ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా 27 నెలల్లో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాం. రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్ కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ప్రగతి కార్యక్రమాలు చేపట్టాం. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్ -1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టులు పూర్తిచేశాం. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి గుంటూరు, విజయవాడకు రాజధానిని కనెక్ట్ చేశాం. ఎకనామిక్ టైమ్స్ పత్రిక సీఈఓ టూ వాటర్‌మాన్ అంటూ కథనం రాసింది. సంతోషం కలిగింది. గ్లోబల్ డ్రీమ్ కేబినెట్లో నా పేరు వచ్చినప్పుడు, సీఈఓ సీఎం అన్నప్పుడు కూడా నేను ఇంత ఆనందించలేదు. రాష్ట్రంలోని భౌగోళిక అసమానతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి ఉంది... దానిని సరిచేస్తూ నీటిని ఆయా ప్రాంతాలకు నీటిని ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి- కావేరీ- మహానది- గంగా లాంటి నదులు అనుసంధానమై వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్ స్టాపబుల్. ఈ నీటి భద్రత, సంరక్షణా చర్యల్ని గుర్తించి వాటర్ మాన్ గా పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది. 36 ప్రాజెక్టులు చేపట్టేందుకు క్యాలెండర్ కూడా ఇచ్చాం. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉంది. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారం అధికారుల తోడ్పాటుతో ఈ విజయాలను సాధించగలిగాం. ఇప్పటి దాకా సాధించిన ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు.. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇలా అందరి వల్ల సాధ్యమైంది.. ఈ విజయం టీమ్ సక్సెస్." అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి..** "మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధి-పాలన పెండింగ్ లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి."అని ముఖ్యమంత్రి వివరించారు.

**నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం..** "ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం.

# దేశానికే ప్రధాన పర్యాటక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ -పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

- ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ఏపీని విజిట్ చేయండి.. భారతదేశ వైవిధ్యాన్ని అనుభూతి చెందండి
- టూర్ ఆపరేటర్లకు మంత్రి దుర్గేష్ పిలుపు
- సరైన సమయంలో సరైన శాఖ సరైన వ్యక్తి చేతిలో పెట్టారంటూ మంత్రి కందుల దుర్గేష్ ను కొనియాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**విశాఖపట్నం,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** భారతదేశ పర్యాటక చిత్రపటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అత్యంత కీలకమైన, ప్రధానమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. భారతదేశంలో ఇన్ బౌండ్ టూరిజం వృద్ధిని మరింత వేగవంతం చేయడమే ప్రధాన లక్ష్యంగా, "ఇండియా - ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్ తో గురువారం సాయంత్రం విశాఖపట్నంలోని 'నోవాటెల్' హోటల్ వేదికగా 41వ 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్' వార్షిక సదస్సు అత్యంత వైభవంగా ప్రారంభమైంది.ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సు ప్రారంభ సూచికగా 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ మాన్యువల్ బుక్'ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం కుంభమేళా తరహాలో ఆధ్యాత్మికత, సంస్కృతి, వారసత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఏపీ పర్యాటక శాఖ రూపొందించిన ప్రతిష్టాత్మక 'ది గోదావరి కాల్స్' పోస్టర్‌ను మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. అందులో 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల విశిష్టతను, పర్యాటక సర్క్యూట్ ల వివరాలున్నాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. పర్యాటకులు కేవలం ఒక రాష్ట్రాన్ని సందర్శించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక పర్యాటక అనుభవాల ద్వారా భారతదేశ సమగ్ర సంస్కృతిని అనుభూతి చెందుతారని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దేశ విదేశాల నుంచి విచ్చేసిన పర్యాటక ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సందర్శించి, ఇక్కడి సంస్కృతి, అతిథ్యంతో మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని పర్యాటక అవకాశాలను స్వయంగా తెలుసుకొని, ఏపీ పర్యాటకాన్ని ప్రపంచ వేదికపై ప్రచారం చేయడానికి భాగస్వాములు కావాలని కోరారు.ఈ సందర్భంగా 2, 3, 4, మరియు 7 రోజుల ప్రత్యేక ఏపీ పర్యాటక ప్యాకేజీలను రూపొందించాలని కోరారు. ప్రసంగంలో తన భాషాభిమానాన్ని చాటుకుంటూ "దేశభాషలందు తెలుగు లెస్స" అని స్మరించుకున్న మంత్రి దుర్గేష్ ఏపీ పర్యాటక ప్రతినిధులకు ఐఏటీఓ నమోదులో ఉచిత రిజిస్ట్రేషన్ కల్పించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిందని, నూతన పర్యాటక పాలసీ (2024-29) ద్వారా పెట్టుబడిదారులకు భారీ రాయితీలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. అంతేగాక క్యారవాన్, హోమ్ స్టే, ల్యాండ్ అలాట్ మెంట్, ఎంప్లాయిమెంట్ జనరేషన్ తదితర అనుబంధ పాలసీలతో గడిచిన రెండేళ్లలోనే రాష్ట్రానికి రూ. 20,000 కోట్ల పర్యాటక పెట్టుబడులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. పర్యాటకాభివృద్ధిని పాలసీ, ప్రాసెస్, పార్ట్‌నర్‌షిప్, ప్రాజెక్ట్స్, ప్రమోషన్, ప్రొడక్ట్స్ అనే ఆరు ప్రాథమిక సూత్రాల ఆధారంగా పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2019-24 మధ్య పర్యాటక రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెల్‌నెస్, ఎకో, అడ్వెంచర్, హెలీ, సీప్లేన్ టూరిజం వంటి వినూత్న పద్ధతులను వేగవంతం చేశామని తెలిపారు. 1058 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ సముద్రతీరంలో యోగా, ఆయుర్వేద ఆధారిత 'వెల్‌నెస్ టూరిజం'ను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. అరకు, లంబసింగి, మారేడుమిల్లి వంటి అందమైన పర్యాటక ప్రాంతాల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.


## రిజిస్ట్రేషన్ ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లు పోయిన విషయమై ప్రకటన

కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, S/o (లేటు) కుక్కడపు మోహనరావు, విస్సన్నపేటకు చెందిన నాకు, ఎన్.టి.ఆర్. జిల్లా, విస్సన్నపేట మండలం, విస్సన్నపేట గ్రామ రెవిన్యూ పరిధిలో సర్వే నెం. 411-1లో 0.0650 సెంట్లు, 411-4లో 0.02 సెంట్లు, 411-5లో 0.06 సెంట్లు, 411-7లో 0.0650, మొత్తం 0.21 సెంట్ల భూమి, నా తండ్రి ద్వారా 29.01.2014 తేదీ గిఫ్ట్ డీడ్, డాక్యుమెంట్ నెం.198/2014, సబ్-రిజిస్ట్రార్, విస్సన్నపేట ద్వారా సంక్రమించినది.

సదరు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం.3350/1977 మరియు నెం.344/1977లు 05.06.2026న విస్సన్నపేటలోని మా ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్లే ప్రయాణంలో పోయినవి. వెదికినప్పటికీ ఇప్పటివరకు దొరకలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినచో లేదా వాటిపై ఏవైనా హక్కులు / అభ్యంతరాలు / క్లెయిములు ఉన్నచో తగిన ఆధారాలతో క్రింది నంబరును సంప్రదించగలరు.

**కుక్కడపు వెంకట నాగేశ్వరరావు**
S/o కుక్కడపు మోహనరావు, విస్సన్నపేట
మొబైల్: 9885144933



## ఒరిజినల్ పార్టిషన్ డాక్యుమెంట్స్ పోయినవి

బత్తినీ వినోద్ కుమార్ S/o విక్టర్ సామ్, D/no 2-146/1B కొత్తపాడు ఎస్టేట్స్ రోడ్, ఎస్డిఐ స్కూల్ దగ్గరిలో, నూజివీడు టౌన్ ఏలూరు జిల్లా అను నాకు చెందిన పార్టిషన్ డాక్యుమెంట్ 203/2019 ఒరిజినల్ డాక్యుమెంట్ లు మా ఇంటి నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద xerox కోసం వెళుతుండగా మార్గ మధ్యలో పోయినవి దొరికిన యెడల ఈ ఫోన్ నంబర్స్ కు ఫోన్ చేయగలరు

**సెల్ : 92812 46912**


# సెప్టెంబర్ 19న కోదాడలో మెగా జాబ్ మేళా

- 200 నుంచి 250 కంపెనీలను ఆహ్వానించేందుకు విస్తృత కసరత్తు
- వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఏర్పాట్లపై సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** సూర్యాపేట జిల్లాతోపాటు ఉమ్మడి నల్లగొండ, పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సెప్టెంబర్ 19వ తేదీ శనివారం కోదాడలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ ఉపాధి మేళాకు 200 నుంచి 250 కంపెనీలను ఆహ్వానించి, వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు అందించేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కోదాడలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతీ రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్,ఎస్.పి నరసింహ సంబంధిత శాఖల అధికారులు, కార్యక్రమ నిర్వాహక ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విద్యావంతులైన యువతలో నిరుద్యోగం నేడు సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఒకటని మంత్రి పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని స్పష్టం చేశారు. "విద్యావంతులైన నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రతిరోజూ చూస్తున్నాం. ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఇప్పుడు మంత్రిగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నేను నిరంతరం ప్రయత్నిస్తున్నాను. నిజమైన ఉపాధి అవకాశాలను అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ మెగా జాబ్ మేళా ప్రధాన లక్ష్యం" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని మంత్రి గుర్తుచేశారు. ఆ మేళాలో సుమారు 200 కంపెనీలు పాల్గొనగా, దాదాపు 40 వేల మంది నిరుద్యోగ యువత పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిలో దాదాపు 20 వేల మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని, సుమారు మూడు వేల మంది ఉద్యోగాలు పొందడం లేదా తదుపరి దశ ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం జరిగిందని వివరించారు.హుజూర్‌నగర్ జాబ్ మేళా విజయంతో స్ఫూర్తి పొంది, అంతకంటే భారీ స్థాయిలో కోదాడలో ఉపాధి మేళాను నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువతను విస్తృతంగా సమీకరించాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు పొరుగున ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన యువత కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఐటీఐలకు ప్రత్యేక బృందాలను పంపించి, ముఖ్యంగా చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను జాబ్ మేళాకు ఆహ్వానించాలని మంత్రి ఆదేశించారు.

# పేదల వైద్యానికి రూ.25.19 కోట్ల ఆర్థిక సాయం - ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

- 1,957 మందికి రూ.11.71 కోట్ల సీఎంఆర్ఎఫ్ రీయింబర్స్‌మెంట్ చెక్కులు
- 744 మందికి రూ.13.48 కోట్ల ఎల్.ఓ.సిలు.



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైలవరం నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.25.19 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు మైలవరం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద 1,957 మందికి రూ.11,71,00,811 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా చికిత్స కోసం ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తానికి సంబంధించి 744 మందికి రూ.13,48,25,986 విలువైన ఎల్.ఓ.సిలు చెల్లించినట్లు వెల్లడించారు.ఈ రెండు విభాగాల్లో కలిపి ఇప్పటివరకు రూ.25,19,26,797 మేర ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గిస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు మైలవరం నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు.

# తిరుపతి--విజయవాడకు ఫ్లై 91 రెక్కలు





**గన్నవరం,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** తిరుపతి--విజయవాడ మధ్య ఫ్లై 91 నూతన విమాన సర్వీసును గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గురువారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి తొలి ప్రయాణికులకు టికెట్లు అందజేశారు. వారంలో నాలుగు రోజులు నడిచే ఈ సర్వీసు తిరుపతిలో ఉదయం 8.05 గంటలకు బయలుదేరి 9.15 గంటలకు విజయవాడ చేరుతుంది. విజయవాడలో 9.45 గంటలకు బయలుదేరి 10.50 గంటలకు తిరుపతి చేరుతుంది. టికెట్ ధర రూ.3,000--3,500 మధ్య ఉంటుందని తెలిపారు. ఈ సర్వీసుతో అమరావతి ప్రాంత ప్రజలకు తిరుమల దర్శనానికి సౌకర్యం కలుగుతుందని యార్లగడ్డ అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చొరవతో సర్వీసు అందుబాటులోకి వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కూడా సర్వీసు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం 12 ఏళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొంటూ.. అంతర్జాతీయంగా ఎమిరేట్స్, ఖతర్, లుఫ్తాన్సా వంటి విమానయాన సంస్థల సర్వీసులు ప్రారంభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఫ్లై 91 ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలకు ఆన్‌లైన్ అనుమతులు



**హనుమాన్‌జంక్షన్,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు పొందే ప్రక్రియను సులభతరం చేసేందుకు బాపులపాడు మండలంలో ఆన్‌లైన్ నమోదు విధానంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఉత్సవ నిర్వాహకులు అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అధ్యక్షుడు కె.హెచ్. కోటేశ్వరరావు, అభయ ఆంజనేయస్వామి ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం



**హనుమాన్ జంక్షన్,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం వీరవల్లి సెక్టార్ పరిధిలోని ఉమామహేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. 9వ రాష్ట్ర పోషణ మాసోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. ఝాన్సీరాణి, ఏఎన్ఎం బి. సుహాసిని, ఆశా కార్యకర్త బి. దేవకరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు బి. సునీత, బంగారమ్మ, హెల్పర్ శ్రీలతమ్మ, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# ఆర్డీవో ని సన్మానించిన బిజెపి నాయకులు



**తిరువూరు ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** ఉత్తమ ఆర్డీవో గా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా చేతుల మీదుగా అవార్డు పొందిన ఆర్డీవో కుమార్ ని తిరువూరు నియోజకవర్గ బిజెపి నాయకులు సన్మానించడం జరిగింది. ఆర్డీవో గా కుమార్ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి నియోజవర్గంలో పలు సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయని ఈ సందర్భంగా బిజెపి నాయకులు ఆయనను కొనియాడారు. తిరువూరు రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ గా ప్రజా సమస్యల పట్ల, వాటి పరిష్కారం పట్ల స్వయంగా చొరవ తీసుకోవడం పట్ల తిరువూరు నియోజకవర్గ ప్రజలు కూడా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని ఈ సందర్భంగా నాయకులు ఆయనని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిజెపి తిరువూరు నియోజకవర్గ నాయకులు పెనుగొండ రామచంద్రరావు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తోకల శంకర్, తిరువూరు టౌన్ మాజీ అధ్యక్షులు నాళ్ళ సురేష్, ఎన్టీఆర్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి దాడి రాధే, ఎస్సీ మోర్చా విసన్నపేట మండల అధ్యక్షులు లాం కొండలరావు, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడ నిరుద్యోగ పోలీసు అభ్యర్థులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

- పోలీసు రిక్రూట్మెంట్ పోస్టుల సంఖ్య పెంచాలి
- వామపక్షాల పార్టీల డిమాండ్



**కాకినాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** కాకినాడలోళ నిరుద్యోగ పోలీసు అభ్యర్థులపై రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం కచేరి పేట సుందరయ్య భవన్ లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె. వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వ శేషబాబ్జి, మోర్త రాజశేఖర్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన పాలకులు ఎన్నికల సమయంలో సంవత్సరానికి 20 లక్షలు ఉపాధి కల్పిస్తామని లేని పక్షంలో నిరుద్యోగ యువతకు నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీ గుర్తుందా అని ప్రశ్నించారు. ఎన్నో ఆశలతో, ఆకాంక్షలతో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ కి వచ్చి శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు పోలీసు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ 10,000 పైగా పోస్టులు ఉంటాయని ఆశించారన్నారు. కానీ ప్రభుత్వం కేవలం 1600 పోస్టులు మాత్రమే ప్రకటించడం, మరొక ప్రక్క కొంతమంది అభ్యర్థుల వయోపరిమితి దాటిపోతుండడం వల్ల వారిలో ఆందోళన పెరిగిందన్నారు. సోమవారం నిరుద్యోగ అభ్యర్థులు నిర్వహించిన ర్యాలీ గాని, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా గాని శాంతియుతంగానే జరిగాయని గమనించాలన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల రూమ్ లలో, శ్యామ్ ఇనిస్టిట్యూట్ హాస్టల్స్ లో ప్రవర్తించిన తీరు చాలా అభ్యంతరకరంగా ఉందన్నారు. ఉగ్రవాదులు, దోపిడీ దారుల స్థావరాలపై దాడి చేసిన విధంగా నిరుద్యోగులను భయభ్రాంతులకు గురిచేసిన పోలీసు శాఖ తీరును తప్పుబట్టారు. ప్రభుత్వం తాను ఇచ్చిన మరొక హామీ ప్రకారం నియోజక వర్గ స్థాయిలో నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిక్రూట్మెంట్ కొరకు స్టడీ సెంటర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. విద్యార్థి సంఘం నాయకులను అక్రమంగా అదుపులోకి తీసుకోవడానికి సుందరయ్య భవన్ లోకి చొరబడడం సమంజసంగా లేదన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేతను స్టేషన్ కి తీసుకెళ్ళి నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందన్నారు. నిరసన తెలియచేయడం భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కుని గమనించాలన్నారు. ఉద్యమాన్ని ఎవరో ప్రోత్సాహించారని ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలన్నారు. తక్షణమే కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పోలీసు రిక్రూట్మెంట్ పోస్టుల సంఖ్య ను పెంచుతూ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. నిరుద్యోగులే కాదు, ఎవరు ఉద్యమాలు చేసినా వామపక్షాలు మద్దతు ఇస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెవిఎస్ శ్రీనివాస్, పలివెల వీరబాబు తదితరులు కూడా పాల్గొన్నారు.

# పార్టీ కోసం పని చేస్తా పార్టీ ఆదేశాలను శిరసావహిస్తా..

-టిడిపి యువ నాయకులు ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** తాను ప్రపంచంలో ఏ దేశంలో ఉన్న తన ఆలోచన తెలుగు గడ్డ కొరకు తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తా నని ఎన్నారై వల్లభనేని గిరిబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ఆరు నెలల నుండి మండలంలో ప్రజలను కలిచే కార్యక్రమానికి తాను శ్రీకారం చుట్టటం జరిగిందని తెలియజేశారు రు.పది సంవత్సరాలుగా తాను సేవా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నానని టిడిపి అభిమాని అయిన తాను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టడంతో తన మనసు ద్రవించిపోయిందని తెలుగుదేశం పార్టీ గెలుపు కొరకు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలనే దృఢ సంకల్పంతో ప్రజల మధ్యన ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి గత ప్రభుత్వంలో సైతం తన వంతు కృషి చేశానని గుడి బడి చర్చ్ మసీదులు అభివృద్ధికి ఆర్థిక చేయూత అందించడమే కాకుండా ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడే పేదలకు వైద్య సేవలు అందించడంతోపాటు ఇంటి పెద్ద చనిపోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సైతం తెలుగుదేశం పార్టీ తోడుగా ఉంటుందని భరోసా గా వారికి వితరణ అందించామని భరోసాగా నిలిచామన్నారు. రాబోయే మండల ప్రజా పరిషత్ ఎన్నికలలో ఓసి రిజర్వేషన్ వెలువడితే ఎంపీపీ స్థానానికి పోటీ చేస్తారా అన్న ప్రశ్నకు తనకు ఆలోచన లేదని చెప్పడం జరిగింది. తెలుగుదేశం పార్టీ గెలుపులో ప్రధాన భూమిక పోషించిన గిరిబాబు కుటుంబం నుండి తల్లిదండ్రులలో ఒకరిని విస్సన్నపేట ఎంపీపీ రేసులో భాగంగా గెలుపులో ముందుండే విస్సన్నపేట వన్ సెగ్మెంట్ నుండి పోటీ చేయిస్తారా అన్న ప్రశ్నకు సమాధానంగా గిరిబాబు మాట్లాడుతూ యువతకు పట్టం కట్టాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు ఆలోచనలకు అనుగుణంగా తాను అడుగులు వేస్తానని చెప్పడం జరిగింది. టిడిపి అగ్రనాయకత్వం పార్టీ పెద్దలు గిరిబాబు కుటుంబం నుండి ఎంపీపీ చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేస్తే అప్పుడు పరిస్థితి ఏమిటి అని అడగగా ఆనాడు పరిస్థితి అప్పుడు ఆలోచిద్దాం అని దాటవేయడం జరిగింది. టిడిపి పార్టీ కొరకు రాత్రనకా పగలనకా ఎండనక వాననక కష్టపడ్డమే కాకుండా మండలంలో పలువురు నాయకులు చేసిన వాగ్దానాలను కూడా పూర్తి చేయటం అందరికీ తెలిసిందే. 20 24 ఎన్నికలలో కూటమి ప్రభుత్వ గెలుపుకు మెజార్టీ ఓట్లు సాధించేందుకు పోల్ మేనేజ్మెంట్ లో వైరి వర్గాల గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యలకు వారి ఎత్తులకు పై ఎత్తులు వేయటం అగ్రభాగం అయితే దానిని మించి ఆర్థిక చేయూత ఇవ్వటం అంతకుమించి అని చెప్పవచ్చని ఏ రాష్ట్రంలో ఉద్యోగం చేసిన ఎన్నికల సమయానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా గెజిటెడ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల నుండి సాఫ్ట్వేర్లు ఫార్మసిస్టులు రోజు వారి కూలి పనులు చేసుకునే కార్మిక సోదరులు సైతం విస్సన్నపేట మండలంలో వారి వారి గ్రామాలకు వచ్చి ఓట్లు వేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా తిరిగి వెళ్లారంటే అది ఎన్ఆర్ఐ గిరిబాబు పదక రచనే అన్న విషయం సర్వత్రా తెలిసిందే. అధికారం రాకముందు ఉన్న మనస్తత్వాలకు అధికారం వచ్చిన తర్వాత కొందరు మారడం జరుగుతుందని గిరిబాబు విషయంలో నాడు నేడు ఒకే స్వచ్ఛమైన మనసుతో ఆప్యాయతతో పలకరించడంలో ఎలాంటి మార్పు లేకపోవడం రాజకీయాలకు అతీతంగా చెప్పుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు విసన్నపేట పట్టణ టిడిపి అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# తెలుగు భాషా సేవకు మరింత బాధ్యత..

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఉమాసరస్వతికి మండలి బుద్ధప్రసాద్ అభినందనలు.



**మచిలీపట్నం,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్‌లో తెలుగు ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న డా. ఓలేటి ఉమాసరస్వతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న సందర్భంగా తెలుగు భాషాభిమానులు, తెలుగు భాషాపోషకులు, కృష్ణా జిల్లా తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2026 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడ లోని ఏ1 కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉమాసరస్వతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందు కున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మండలి బుద్ధప్రసాద్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఉమాసరస్వతి తెలుగు భాషా ఉపాధ్యాయినిగా వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత, భాషా నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న అనంతరం ఆమెపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై మక్కువను పెంచడంతో పాటు, మాతృభాష గొప్పతనాన్ని వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలుగు భాషను భావితరాలకు మరింత బలంగా అందించేందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. పాఠ్యాంశాలతో పాటు సాహిత్యం, పద్యాలు, కథలు, రచనా నైపుణ్యాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగించే విధంగా బోధన సాగాలని సూచించారు. తెలుగు భాష పరిరక్షణకు పాఠశాల స్థాయి నుంచే పునాది వేయాలని, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని తెలిపారు. మాతృభాషపై ప్రేమ, గౌరవం పెంపొందితేనే తెలుగు భాషకు భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా మండలి బుద్ధప్రసాద్ ఉమాసరస్వతిని దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయి పురస్కారం సాధించడం ద్వారా పురిటిగడ్డ విద్యాసంస్థకు, కృష్ణా జిల్లాకు ఆమె మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి, తెలుగు భాషాభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# హైస్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైమ్,అత్యవసర నెంబర్ మరియు కొత్త చట్టాలపై అవగాహన



**ఏలూరు జిల్లా/నూజివీడు,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో చిన్నంపేటలో ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ వారు నూజివీడు డీఎస్పీ శ్రీ కే.వి.వి.ఎన్.వి. ప్రసాద్ యొక్క ఆదేశాలపై నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో చాట్రాయి ఎస్సై డి. రామకృష్ణ మరియు వారి సిబ్బంది చిన్నంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ క్రైమ్, అత్యవసర నంబర్లు మరియు కొత్త చట్టాలపై అవగాహన సదస్సు ను నిర్వహించినారు.చాట్రాయి ఎస్సై డి. రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు ఎంత జాగ్రత్తగా ఉండాలో ఎస్సై డి. రామకృష్ణ వివరించారు.ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, లాటరీ మోసాలు మరియు సోషల్ మీడియా వేదికగా జరిగే సైబర్ క్రైమ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయకూడదని హెచ్చరించారు.అత్యవసర టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ డయల్ 112 ఎలాంటి ప్రాణాపాయ లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైనా క్షణాల వ్యవధిలో పోలీసుల సహాయం పొందడానికి ఈ నంబర్‌ను సంప్రదించాలి. 1930 ఆన్‌లైన్ మోసాల బారిన పడినప్పుడు లేదా సైబర్ బాధితులుగా మారిన వెంటనే ఫిర్యాదు చేయడానికి ఈ నెంబర్ కు కాల్ చేయాలి. మోసం జరిగిన వెంటనే సమాచారం ఇస్తే డబ్బును కోల్పోకుండా రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. 1098 (Child Helpline) పిల్లల రక్షణ మరియు వారి హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ టోల్ ఫ్రీ నంబర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.దేశంలో అమల్లోకి వచ్చిన నూతన చట్టాల (దీమీ వంటివి) గురించి, పౌరుల హక్కులు మరియు బాధ్యతల గురించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, చదువుపై మాత్రమే దృష్టి పెట్టాలని, ఏదైనా సమస్య ఉంటే భయపడకుండా ధైర్యంగా పోలీసులను లేదా తల్లిదండ్రులను సంప్రదించాలని సూచిస్తూ ఈ అవగాహన కార్యక్రమం చేపట్టిన చాట్రాయ్ డి రామ కృష్ణ.

# వితంతు పెన్షన్ల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గంలో వితంతు దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పరిష్కరించారు. పెడన నియోజకవర్గంలోని వితంతు సోదరీమణుల సమస్యను గుర్తించి తక్షణ పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ కింద వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ కార్డులో మరణించిన భర్త పేరు తొలగించడం అవసరంగా వుంది.అయితే ఈ ప్రక్రియకు ఇప్పటివరకు నెలల సమయం పట్టే పరిస్థితి ఉంది.పింఛన్ దరఖాస్తుకు ప్రభుత్వం విధించిన గడువు ముగిసేలోపు ప్రక్రియ పూర్తికాక వితంతు వులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ దృష్టికి వెళ్ళింది. సంబంధిత అధికారులతో మాట్లాడి రేషన్ కార్డులో భర్త పేరు తొలగింపు ప్రక్రియను తహసీల్దార్ కార్యాలయం లాగిన్ ద్వారా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఈ ప్రక్రియను వేగవంతంగా అమలు చేస్తూ దరఖాస్తుదారుల సమస్యలను ఒకరోజులోనే పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయము.

# నాయీబ్రాహ్మణ సేవా సంఘం విఘ్నేశ్వర ఆలయానికి 18 లక్షలు మంజూరు



**పెడన,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** పెడన నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా పూజలు అందుకున్న పెడన పట్టణం బస్టాండ్ సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి ఆలయం కు 18 లక్షల నిధులు మంజూరయ్యాయి.శిథిలావస్థకు చేరి అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ఈ ఆలయంకు శాసనసభ్యులు కాగిత కృష్ణప్రసాద్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణు గోపాలరావు సహకరించారు. తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారుల ద్వార టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు కొరకు సిఫార్సు చేయగా దేవదాయ ధర్మదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ శ్రీ విఘ్నేశ్వర ఆలయం నిర్మాణం కొరకు 18 లక్షల రూపాయల నిధులు మంజూరు ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో సంఘ పెద్దలు ఎమ్మెల్యే ని గురువారం మర్యాద పూర్వకంగా కలిసారు.దుశ్శాలువతో సత్కరించి ఉత్తర్వులును ఎమ్మెల్యే చేతులు మీదుగా కమిటీ సభ్యులు అందుకున్నారు.

# ఇంద్రపాలెం శ్రీగోపాల కృష్ణ మందిరం వద్ద అన్న సమారాధన

- జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంసి ఛైర్మన్ మంగ గంగయ్య చేతుల మీదుగా
- 3వేల మందికి పైగా ప్రసాద వితరణ





**కాకినాడ రూరల్,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెంలోని ప్రసిద్ధ శ్రీ గోపాలకృష్ణ మందిరం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని గురువారం భారీ అన్న సమారాధన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మహా అన్నప్రసాద వితరణను కాకినాడ రూరల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్,యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాసుమేను మంగ గంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. ఇంద్రపాలెంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు మూడు వేల మందికి పైగా భక్తులకు పసందైన వంటకాలతో కూడిన అన్నప్రసాదాన్ని వడ్డించినట్లు పేర్కొన్నారు. తీర్థప్రసాదాల స్వీకరణకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా యాదవ సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిం చడం జరిగిందని ఈ సందర్భంగా వారి సేవలను ప్రశంసించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో యాదవ సంఘ ప్రతినిధులు,ఆలయ నిర్వాహకులు,స్వర్ణ రామారావు ,కందుల శ్రీనివాస్,కట్టిమేను దుర్గారావు,మర్రెడి రాజు ,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పోలింగ్ బూత్ లను వెరిఫికేషన్ చేసిన మండలాధికారులు



**విస్సన్నపేట,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కలగర, కొర్లమండ, తాత కుంట్ల, మారేమండ ,నరసాపురం, వేమిరెడ్డిపల్లి గ్రామాల పరిధిలోని 26 పోలింగ్ బూత్ లను ఎంపీడీవో సిహెచ్ చిన్న రాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సచివాలయ సిబ్బంది వెరిఫై చేయడం జరిగింది. గతంలో వినియోగించిన బూత్ లు అయిన కానీ రాబోయే ఎన్నికలకు అనువైన మౌలిక వసతులు విషయమై పరిశీలించడం జరిగింది అన్నారు.

# సంపాదకీయం

## అమెరికాను దాటేసిన జర్మనీ.. భారతీయ విద్యార్థులకు నంబర్ వన్ స్టడీ అబ్రాడ్ డెస్టినేషన్

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలని భావించే భారతీయ విద్యార్థుల ప్రాధాన్యతలు, ఆలోచనా సరళిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటివరకు స్టడీ అబ్రాడ్ అనగానే అందరికీ ముందుగా గుర్తుకువచ్చే అమెరికా, కెనడా, బ్రిటన్ వంటి సంప్రదాయ దేశాలను దాటుకొని జర్మనీ ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత కలిగిన నంబర్ వన్ డెస్టినేషన్‌గా దూసుకొచ్చింది. ఒకప్పుడు కేవలం అమెరికాకే ప్రాధాన్యం ఇచ్చిన విద్యార్థులు ఇప్పుడు ప్రాక్టికల్ అంశాలను బేరీజు వేసుకుంటూ యూరప్ వైపు అడుగులు వేస్తున్నారు. విదేశీ విద్యను కోరుకునే భారతీయ విద్యార్థుల్లో ఏకంగా 48 శాతం మంది జర్మనీని తమ మొదటి ఎంపికగా పేర్కొన్నారు. అదే సమయంలో ఒకప్పుడు తిరుగులేని ఆదరణ పొందిన అమెరికాను కేవలం 20 శాతం మంది మాత్రమే ఎంచుకోవడం గమనార్హం. 2023లో జర్మనీని ఎంచుకున్న విద్యార్థుల శాతం 25గా ఉండగా.. కేవలం మూడేళ్ల వ్యవధిలోనే ఈ ఆదరణ దాదాపు రెట్టింపు స్థాయికి చేరింది. ఇది అంతర్జాతీయ విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న ఒక కీలకమైన మార్పుకు స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది. భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు ఇంతగా మొగ్గు చూపడానికి ప్రధాన కారణం అక్కడి తక్కువ విద్యా వ్యయం. జర్మనీలోని అనేక ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ట్యూషన్ ఫీజులు చాలా స్వల్పంగా ఉండటం లేదా కొన్ని సందర్భాల్లో అసలు లేకపోవడం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా పెద్ద ఉపశమనాన్ని ఇస్తోంది. దీనికి తోడు ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఆటోమొబైల్ టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక రంగాలలో జర్మనీ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. దాంతో చదువుతో పాటు ప్రాక్టికల్ పరిజ్ఞానం లభిస్తుందనే నమ్మకం విద్యార్థుల్లో పెరుగుతోంది. కేవలం నాణ్యమైన చదువు మాత్రమే కాకుండా డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయనే అంశానికి విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. జర్మనీలో కోర్సు పూర్తయిన అంతర్జాతీయ విద్యార్థులకు ఉద్యోగ అన్వేషణ కోసం ప్రభుత్వం తగినంత సమయం ఇస్తోంది. అక్కడ ఉన్న బలమైన పారిశ్రామిక రంగాలు, చదువు తర్వాత స్థిరపడటానికి లభించే స్పష్టమైన అవకాశాలు భారతీయ విద్యార్థులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మరోవైపు అమెరికాలో కఠినమైన వీసా నిబంధనలు, విపరీతమైన పోటీ, నిరంతరం మారే ఇమ్మిగ్రేషన్ విధానాలు, చదువు పూర్తయిన తర్వాత అక్కడే ఉండి ఉద్యోగం చేసుకునే అవకాశాలపై ఉండే అనిశ్చితి వల్ల విద్యార్థుల్లో భయం నెలకొంటోంది. అమెరికా ఇంకా అత్యుత్తమ యూనివర్సిటీలకు నిలయంగా ఉన్నప్పటికీ ఈ ఆర్థిక, ఇమ్మిగ్రేషన్ ఒత్తిళ్ల కారణంగా విద్యార్థులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ మార్పు జర్మనీ విశ్వవిద్యాలయాల్లో గణనీయంగా కనిపిస్తోంది. 2025–26 శీతాకాల సెమిస్టర్ నాటికి జర్మనీలో భారతీయ విద్యార్థుల సంఖ్య 17.5 శాతం పెరిగి 69,816కి చేరింది. దీంతో జర్మనీలో అత్యధికంగా ఉన్న అంతర్జాతీయ విద్యార్థుల సమూహంగా భారతీయులు రికార్డు సృష్టించారు. జర్మనీ బాటలోనే ఫ్రాన్స్, ఫిన్లాండ్, నెదర్లాండ్స్ వంటి ఇతర యూరప్ దేశాలు కూడా విద్యార్థుల కొత్త చిరునామాలుగా మారుతున్నాయి. మొత్తానికి విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ కంటే విద్యా వ్యయం, ఉద్యోగ భద్రత, జీవన ప్రమాణాలకే నేటి విద్యార్థులు పెద్దపీట వేస్తున్నారని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ సమావేశం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)**రానున్న వినాయక చవితి, గణేష్ నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ ఛాంబర్ లో గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, తదితర అంశాలపై చర్చించారు. ఉత్సవ కమిటీలు, నగరపాలక సంస్థ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాలను సజావుగా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ జనరల్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజలు, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గణేష్ ఉత్సవ సమితి ఎన్‌టీఆర్ జిల్లా కార్యాలయ ప్రముఖ్, జాయింట్ సెక్రటరీ జి.వి.ఎస్. రమణమూర్తి, విజయవాడ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు యెండూరి కిషోర్, ఉపాధ్యక్షులు వి. కృష్ణమోహన్, కార్యదర్శి వి. పల్లపరాజు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు-సుల్తానా బేగం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని తెలిపారు డబ్ల్యూ డి సి పిడి షేక్ సుల్తానా బేగం. ఇబ్రహీంపట్నం ఫెర్రీ లో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో గురువారం పాల్గొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటటమే కాకుండా వాటిని సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి హాని కలుగుతుందని అనేక అనర్థాలు కలిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పుష్పలత పిడి, ఈవో అచ్యుతాంబ సూపర్వైజర్లు మాధవి, శివకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వైసీపీ రాక్షసానందం ఆవిరైంది.. కడిగిన ముత్యంలా చంద్రబాబు వెలిగి నిజమే గెలిచింది






**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ జరిగి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, విజయనగరం పార్లమెంట్ అధ్యక్షులు నాగర్జున, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు షణ్ముకరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్, శ్రీశైలం ఆలయ కమిటీ మెంబర్ ఏవీ రమణ, ఇతర పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కొవ్వొత్తులు వెలిగించి సంఘీభావం తెలిపారు. 'నిజం గెలిచింది.. ప్రజాస్వామ్యం నిలిచింది', 'నిజమే గెలిచింది' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వర్ల రామయ్య మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల క్రితం ఇదే రోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఒక చీకటి రోజు. ఎటువంటి తప్పూ చేయని ఒక గొప్ప ప్రజా నాయకుడిపై అక్రమంగా బనాయించిన దొంగ కేసులతో అర్ధరాత్రి పూట అరెస్ట్ చేసిన దుర్మార్గమైన రోజిది అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఏనాడూ అవినీతి మరక అంటని వ్యక్తి, ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన నిష్కళంక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. తెలుగుజాతి ఖ్యాతిని, ఆత్మగౌరవాన్ని ప్రపంచ యవనికపై నిలిపిన దార్శనికుడు ఆయన. తన విజన్‌తో ఐటీ విప్లవాన్ని తీసుకొచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించి, వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన నేత చంద్రబాబు. ఈనాడు దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన నగరంగా హైదరాబాద్ నిలిచిందంటే, ఆనాడు ఆయన వేసిన పటిష్టమైన పునాదులే కారణం. రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్ర ప్రగతికి దిక్సూచిగా అమరావతిని రాజధానిగా ప్రకటించి, ప్రపంచ స్థాయి నగర నిర్మాణానికి శ్రీకారం చుట్టింది చంద్రబాబు నాయుడే. 'ఒక్క ఛాన్స్' అంటూ ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పాలనంతా అరాచకమే లక్ష్యంగా సాగింది. తాను 16 నెలల పాటు జైల్లో ఉండి చిప్పకూడు తిన్నాననే అక్కసుతో, చంద్రబాబును కూడా ఎలాగైనా జైలుకు పంపాలనే దుగ్ధతో తప్పుడు సాక్ష్యాలు, దొంగ కేసులను సృష్టించారు. ప్రభుత్వ పెద్దల మోచేతి నీళ్లు తాగే కొందరు పోలీసు అధికారులను అడ్డుపెట్టుకుని, అర్ధరాత్రి పూట ఆయన బస చేసిన బస్సు వద్దకు వెళ్లి అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారు. ఆ దుర్మార్గాన్ని చూసి యావత్ ఆంధ్రప్రదేశ్ దిగ్భ్రాంతికి గురై స్తంభించిపోయింది. ధర్మం, న్యాయం ఎప్పటికీ ఓడిపోవని, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన చంద్రబాబు నాయుడిని అక్రమ కేసులతో ఇబ్బంది పెట్టిన వారికి ప్రజలే సరైన రీతిలో గుణపాఠం చెప్పారని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

**చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టుపై ప్రపంచవ్యాప్త ఆగ్రహం.. కడిగిన ముత్యంలా గెలిచిన ధర్మం**చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల్లో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చారు. దేశ విదేశాల్లోని తెలుగువారంతా ముక్తకంఠంతో ఖండించారు. రాష్ట్రంలో వయోభేదాలు లేకుండా, కుల, మత, రాజకీయాలకు అతీతంగా సామాన్య ప్రజలు సైతం రోడ్డెక్కి 'ఇదేం అన్యాయం, ఇదేం దుర్మార్గం' అని ప్రశ్నించారు. ప్రజాగ్రహాన్ని చూసి ఆనాటి జగన్ ప్రభుత్వం, కొందరు పోలీస్ అధికారులు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాజమండ్రి సెంట్రల్ జైల్లో 53 రోజుల పాటు చంద్రబాబు ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. స్నానానికి బకెట్ వేడినీళ్లు అడిగినా ఇవ్వకుండా వేధించారు. కనీసం తాగే నీళ్లు, తినే స్వల్ప ఆహారం విషయంలో కూడా నిబంధనల పేరుతో నానా కష్టాలు పెట్టి జగన్ ప్రభుత్వం ఆయన ఉసురు పోసుకుంది. ఏ కేసుతో ఆయన్ను ఇబ్బంది పెట్టాలని చూశారో, చివరకు ఏ సాక్ష్యాలూ లేవని దర్యాప్తు చేసిన సీఐడీ అధికారులే చేతులెత్తేశారు. చంద్రబాబు కి ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని తేల్చి, రిఫరల్ రిపోర్టును సమర్పించారు. కోర్టు కూడా దాన్ని ఆమోదించడంతో న్యాయం గెలిచింది, చంద్రబాబు గారు ఎలాంటి మచ్చలేకుండా నిర్దోషిగా బయటకు వచ్చారు. మూడేళ్ల క్రితం మొదలైన ఆ చీకటి రోజులను, రాజమండ్రి జైల్లో చంద్రబాబు గారు గడిపిన 53 రోజుల అన్యాయపు బందిఖానాను గుర్తుచేసుకుంటూ పార్టీ కార్యాలయంలో 53 కొవ్వొత్తులను వెలిగించడం జరిగింది. పెద్దలందరి సమక్షంలో ఆ చీకటి రోజులను తలచుకుంటూ, ప్రజాస్వామ్య రక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని వర్ల రామయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాతర్ల రమేష్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, చిత్తూరు జిల్లా నాయకులు పర్వీన్ తాజ్, రాజు నాయక్ తెలంగాణ టీడీపీ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సెల్ నాయకులు కొడూరు అఖిల్, మార్కాపురం జిల్లా నాయకులు మల్లిఖార్జున నాయుడు, రైతు సంఘం నాయకులు బొంతు సాంబిరెడ్డి, ప్రవాసాంధ్రులు రాధాకృష్ణ, ఉన్నం నవీన్, దేవినేని శంకర్ నాయక్, బీసీ సెల్ కార్యదర్శి ఓబయ్య యాదవ్, శ్రీకాళహస్తి మైనార్టీ సెల్ నాయకులు జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# సీ సీ ఆర్ ఏ ఎస్-ఎస్ పి ఏ ఆర్ కే (యూజీ ) కార్యక్రమానికి ఎంపికైన డా. ఎన్ ఆర్ ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల విద్యార్థిని





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ: డా. ఎన్ ఆర్ ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల, విజయవాడకు చెందిన ద్వితీయ సంవత్సరం బి ఏ ఎమ్ ఎస్ విద్యార్థిని కుమారి దేవి వైష్ణవి, ప్రతిష్ఠాత్మకమైనసీ సీ ఆర్ ఏ ఎస్–ఎస్ పి ఏ ఆర్ కే కార్యక్రమానికి ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. బుల్లయ్య హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు. కేంద్ర ఆయుర్వేద శాస్త్ర పరిశోధనా మండలి, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ పి ఏ ఆర్ కే (యూజీ )కార్యక్రమం ద్వారా ఆయుర్వేద విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, జాతీయ స్థాయి పరిశోధనా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి ఎంపికైన కుమారి దేవి వైష్ణవికి జజ=ూూ తరఫున రూ. 50,000/– (యాభై వేల రూపాయలు) స్కాలర్‌షిప్‌ను చెక్కు రూపంలో అందజేశారు. ఈ స్కాలర్‌షిప్ విద్యార్థినిని పరిశోధనా రంగంలో మరింతగా ప్రోత్సహించేందుకు దోహదపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. కుమారి దేవి వైష్ణవి ఈ కార్యక్రమంలో డా. డి. అనిల్ కుమార్, ప్రొఫెసర్, విభాగాధిపతి, మరియు డా. కె. సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్, రోగనిదాన, వికృతి విజ్ఞాన విభాగం వారి మార్గదర్శకత్వంలో పాల్గొంటున్నారు. విద్యార్థినికి అందించిన మార్గదర్శకత్వం మరియు ప్రోత్సాహాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా డా. టి. బుల్లయ్య, ప్రిన్సిపాల్, కుమారి దేవి వైష్ణవిని అభినందిస్తూ, జాతీయ స్థాయి పరిశోధనా కార్యక్రమానికి ఎంపిక కావడం, అలాగే జజ=ూూ నుంచి రూ. 50,000/– స్కాలర్‌షిప్ పొందడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థుల్లో పరిశోధనా ఆసక్తిని పెంపొందించేందుకు కళాశాల తరఫున అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డా. విజయ శాంత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ (అకడమిక్), కళాశాల అధ్యాపకులు మరియు ఇతర సిబ్బంది హాజరై కుమారి దేవి వైష్ణవిని అభినందించారు. సీ సీ ఆర్ ఏ ఎస్–ఎస్ పి ఏ ఆర్ కే (యూజీ )వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి కార్యక్రమాల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొని, పరిశోధనా రంగంలో రాణించి కళాశాలకు మరియు ఆయుర్వేద రంగానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు.

# పురపాలక ఎన్నికల ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** రానున్న పురపాలక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియ, అందిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్, వాటిపై తీసుకున్న చర్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. డీలిమిటేషన్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు అందిన అభ్యంతరాల వివరాలను పరిశీలించి, వాటిపై నిబంధనల ప్రకారం తీసుకున్న చర్యలను కమిషనర్ సమీక్షించారు. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రతి వార్డుకు అవసరమైన పోలింగ్ కేంద్రాల సంఖ్యను గుర్తించి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. 2021లో నిర్వహించిన పురపాలక ఎన్నికల సమయంలో అనుసరించిన విధానాలు, ఏర్పాట్లను పరిశీలించి, ప్రస్తుత ఎన్నికలకు కూడా అవసరమైన మేరకు వాటిని అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అదనంగా అవసరమైన సౌకర్యాలు, ఏర్పాట్లు ఏమైనా ఉంటే వాటిని ముందుగానే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం 64 డివిజన్ల సభ్యుల సామర్థ్యానికి అనుగుణంగా ఉన్న కౌన్సిల్ హాల్‌ను, డీలిమిటేషన్ నేపథ్యంలో లో 86 వార్డుల సభ్యులకు అనుగుణంగా మార్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఇందుకు ఇంజనీరింగ్ విభాగం, సెక్రటరీ సెల్ అధికారులు సమన్వయంతో పనిచేసి అవసరమైన మార్పులు, సౌకర్యాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్ బాబు, రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస్, సెక్రటరీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన్ టైమ్ పరీక్షా కేంద్రం మార్పు.

**మచిలీపట్నం సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ నెల 15 వ తేదీ నుండి విజయవాడ లో జరగబోయే వన్ టైమ్ సెటిల్మెంట్ పరీక్షా కేంద్రం ను మార్పు చేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి వీరబ్రంహాచారి తెలిపారు. తొలుత ప్రకటించిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల నుండి డా. ఎన్ టి ఆర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ కు మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. బందరు రోడ్ లో ఆల్ ఇండియా రేడియో స్టేషన్ ఎదురు వీధి లో ఉన్న డా. ఎన్ టి ఆర్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్ లో ఈ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు గమనించాలని కోరుతున్నారు.

# రిలయన్స్ స్మార్ట్‌లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలపై తనిఖీ





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం మొగల్రాజపురంలోని రిలయన్స్ స్మార్ట్‌ను రీజినల్ ఫైర్ ఆఫీసర్ తన సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీజినల్ ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ, రిలయన్స్ స్మార్ట్ యాజమాన్యం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ ఓ సీ ) కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో ఎన్ ఓ సీ జారీ చేయడానికి ఆస్కారం లేదని తెలిపారు. తనిఖీల్లో అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని అగ్నిమాపక భద్రతా పరికరాలు పనిచేయడం లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. అధిక జనసాంద్రత ఉండే వాణిజ్య ప్రదేశాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనిచేయని అగ్నిమాపక పరికరాలను వెంటనే మరమ్మతు చేసి, అన్ని భద్రతా ఏర్పాట్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి యాజమాన్యానికి రెండు రోజుల సమయం ఇచ్చినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా అన్ని అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను, పరికరాలను సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకున్న అనంతరం మాత్రమే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి )**నగరంలో ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, దోమల నివారణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌కు సమీపంలోని సమావేశ మందిరంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగం సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రజారోగ్య పరిస్థితులు, పారిశుద్ధ్య నిర్వహణ, వర్షాకాలంలో చేపడుతున్న దోమల నివారణ చర్యలపై సమీక్షించారు. నగరంలోని ఆసుపత్రుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగరంలోని ప్రతి ఆర్వో ప్లాంట్‌ను ప్రతి నెలా తప్పనిసరిగా నీటి నాణ్యతపై పరీక్షలు నిర్వహించాలని వాటిని క్రమ తప్పకుండా అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే బరియల్ గ్రౌండ్స్, పార్కులు పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హోటళ్లు, రెస్టారెంట్లపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, పరిశుభ్రత ప్రమాణాలు పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో మలేరియా, ఇతర దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిరంతరాయంగా ఫాగింగ్, ఎంఎల్ ఆయిల్ స్ప్రేయింగ్, వ్యర్థాల తొలగింపు, డ్రైన్లలో పూడికతీత వంటి కార్యక్రమాలను చేపట్టి దోమల వృద్ధికి అవకాశం లేకుండా చూడాలని సూచించారు. ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ పి. అన్నపూర్ణ, డాక్టర్ ఎన్. గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ దేవిన హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, శానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# తాతయ్య మంచి మాటలు




ఆలోచన గొప్పగా
మనసే పవిత్రంగా
ఉంచుకుంటే ఉత్తమము
బాగుండును జీవితము
పెద్దలతో ప్రేమగా
బ్రతుకులోన బుద్ధిగా
ఉంటేనే గౌరవము
గుర్తించును సమాజము
పనిలోన నమ్మకంగా
అన్నింటా ధైర్యంగా
సాగిపోతే మంచిది
సాహసిస్తే ఘనమైది
గురువులను దైవంగా
కన్నోళ్లను మిన్నగా
భావిస్తే దీవెనలు
వర్ధిల్లుతాయి బ్రతుకులు

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో విస్తృత తనిఖీలు

## బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించని 8 సంస్థలకు నోటీసులు

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ నిర్మల గ్లోరీ సూచనల మేరకు, 40వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఆదినారాయణ, సిబ్బందితో కలిసి గురువారం డివిజన్ పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా భవానిపురం, క్రాంబే రోడ్ ప్రాంతాలలో గల ఆసుపత్రులు, క్లినిక్‌లలో బయో మెడికల్ వ్యర్థాల సేకరణ, వేరు చేయడం, నిల్వ చేయడం, తరలింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు పాటించని కేబి డయాగ్నసిస్ సెంటర్, తులసి క్లినిక్, సాయి నర్సింగ్ హోమ్, అల్మట్టి నర్సింగ్ హోమ్, భవాని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ఆర్కే డయాగ్నస్టిక్ సెంటర్, భయపరెడ్డి క్లినిక్, ఎమ్రిన్ ఆసుపత్రులకు బయో మెడికల్ వేస్ట్ రూల్స్, 1998 మరియు ఎస్ .ఓ . నెంబర్ 630(ఈ ) ప్రకారం నోటీసులు జారీ చేశారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఆసుపత్రి, క్లినిక్ బయో మెడికల్ వ్యర్థాలను ఉత్పత్తి అయ్యే ప్రదేశంలోనే తప్పనిసరిగా వేరు చేయాలని అధికారులు



సూచించారు. నిబంధనల ప్రకారం పసుపు, ఎరుపు, తెలుపు, నీలం రంగుల కేటగిరీలకు అనుగుణంగా వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణకు తరలించాలని స్పష్టం చేశారు. బయో మెడికల్ వ్యర్థాలను నిర్లక్ష్యంగా నిర్వహించడం వల్ల ప్రజారోగ్యానికి, పారిశుధ్యానికి, పర్యావరణానికి హాని కలిగే అవకాశం



ఉన్నందున, సంబంధిత నిబంధనలను ప్రతి ఆసుపత్రి, క్లినిక్ తప్పనిసరిగా పాటించాలని అధికారులు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని నగరంలోని ఆసుపత్రులు, క్లినిక్‌లలో తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సర్కిల్-1 శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.వి.ఎస్. శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ప్రజారోగ్యం సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటరి మహిళ పింఛన్ అర్హత లో వయసు నిబంధన ఎత్తివేయాలి




**జగ్గయ్యపేట సెప్టెంబర్ 10 (వార్తప్రభ)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్న వేళ ఒంటరి మహిళలకు వయస్సు 50 సంవత్సరాలు నిండాలనే నిబంధన ఒంటరి మహిళల పట్ల శాపంగా మారింది. ఒంటరి మహిళ పింఛన్ కు అప్లై చేయాలంటే కచ్చితంగా 50 సంవత్సరాలు పైబడిన వారే అర్హులని ఆన్లైన్లో చూపిస్తుందని దీంతో పింఛన్ కు అప్లై చేసుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఒంటరి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒంటరి మహిళ పింఛన్ కు 35 సంవత్సరాలు పైబడిన వారు అర్హులుగా ఉండగా... గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండాలనే నిబంధన అమల్లోకి తీసుకువచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం వయసు ఆ నిబంధనను సరిచేయకుండా పింఛన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో మనస్పర్ధలు, అనివార్య కారణాలవల్ల భర్త నుండి విడాకులు పొంది / భర్తతో దూరంగా ఉంటున్న ఒంటరి మహిళలు, పెళ్లికాని మహిళలు తాము పింఛన్ కు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని. ప్రభుత్వంలోని పెద్దలు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ స్పందించి ఒంటరి మహిళ పింఛన్ దరఖాస్తులలో వయసు నిబంధన ఎత్తివేయాలని వారు కోరుతున్నారు.

# స్థానిక సంస్థలపై జనసేన సమన్వయ కమిటీ చర్చలు



**మచిలీపట్నం సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నంలో జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్, మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బండి రామకృష్ణ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి అవనిగడ్డ ఎమ్మెల్యే, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల సమన్వయ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. జనసేన పార్టీ అధిష్టానం ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థలకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమన్వయం, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ కో-ఆర్డినేషన్ టీమ్ సభ్యులు డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పినిశెట్టి నాగ ఛాయాదేవి, సపోర్ట్ టీమ్ సభ్యులు బచ్చు కృష్ణకుమారి, రత్నం నాగేశ్వరరావు, వేమూరి త్రినాథ్, మోకా రవి, ఏ. రాజ్యలక్ష్మి, పుల్లేటి దుర్గారావు, బొప్పన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు

## డప్పు కళాకారులు, చర్మకారుల పింఛన్లకు స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డుల ద్వారా దరఖాస్తులు



**మచిలీపట్నం సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డప్పు కళాకారులు, చర్మకారులకు మంజూరు చేసే పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారు సాంఘిక సంక్షేమ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేదని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు తెలిపారు. అర్హులైన వారు స్వీయ ధృవీకరణతో తమ సమీపంలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో దరఖాస్తుదారుల వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ నమోదు చేసి, పింఛన్ దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పిస్తారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తులను సంబంధిత వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ (రూరల్), వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ (అర్బన్) పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి, అర్హత నిర్ధారణకు క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తారని వివరించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం అర్హులైన దరఖాస్తులను తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్‌కు పంపిస్తారని షాహిద్ బాబు తెలిపారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు సాంఘిక సంక్షేమ కార్యాలయాలకు వచ్చి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని, తమకు సమీపంలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు సచివాలయాన్ని సంప్రదించి స్వీయ ధృవీకరణతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, పరిశీలన, క్షేత్రస్థాయి ధృవీకరణ తదితర ప్రక్రియలను సంబంధిత అధికారులు నిర్దేశిత విధానం ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ఏవైనా సందేహాలు లేదా ఇబ్బందులు ఎదురైతే గ్రామీణ ప్రాంతాల్లో స్వర్ణ గ్రామ సచివాలయంలోని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను, పట్టణ ప్రాంతాల్లో స్వర్ణ వార్డు సచివాలయంలోని వార్డు వెల్ఫేర్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలని ఆయన కోరారు. పేద ప్రజలకు ప్రాథమిక వైద్యం అందజేస్తున్న ఆర్ఎంపి, పి.ఎం.పి లకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వాలి లిలి శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10 (వార్తాప్రభ): గ్రామీణ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు చట్టబద్ధ గుర్తింపు కల్పించాలని టీఆర్పీఎస్ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.ఆర్.పి.ఎస్ వైద్య సంఘాల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ జీవో 1273, 428, 429 ప్రకారం ప్రభుత్వానికి రుసుము చెల్లించి శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు, గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. శిక్షణ పొందని వారికి కూడా శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించడంతో ఆర్ఎంపీ, పీఎంపీల్లో ఆందోళన నెలకొందని, వారికి భరోసా కల్పించేందుకే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం తెలంగాణకు చెందిన సుమారు 18 వేల మంది ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రథమ చికిత్స అందించే సేవకులుగా గుర్తింపు లభించిందన్నారు. అనంతరం సుమారు 40 వేల మంది ప్రభుత్వానికి రుసుము చెల్లించి ఏడాది పాటు వెయ్యి గంటల శిక్షణ పొందారని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు వైద్య సేవల పరిధిని ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించాలని, ఆ పరిధిలోనే పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గ్రామీణ వైద్యులపై దాడులు, తనిఖీలు, కేసుల పేరుతో వేధింపులు చేయవద్దని కోరారు. పల్స్‌పోలియో, ఎయిడ్స్ అవగాహన, కుటుంబ నియంత్రణ, బోదకాలు నివారణ తదితర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. త్వరలో యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసి బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, పట్టణ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పనితీరుపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధ్యక్షుడు ఎండీ జఫ్ఫార్, మహిళా అధ్యక్షురాలు సునీత, కార్యదర్శి జయశ్రీ, బుచ్చిబాబు, డాక్టర్ నందిని, డాక్టర్ ఖాన్‌సాబ్, డాక్టర్ చారి, డాక్టర్ శివరాజ్, డాక్టర్ అనిల్, డాక్టర్ రాజు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పుందరికం, డాక్టర్ అఖిల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నగర పరిధిలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఎస్టేట్ మరియు టౌన్ ప్లానింగ్ అది కారులను ఆదేశిం చారు. గురువారం ఉదయం నగరంలో శిథిలావస్థలో ఉన్న ప్రైవేట్, పబ్లిక్ భవనాల పరిస్థితిపై అధికారులతో సమీక్షించిన కమిషనర్, నిర్మాణపరంగా స్థిరత్వం లేని, ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న భవనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం సీజ్ చేయడంతో పాటు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో నిర్మాణ స్థిరత్వం లేని, నివాసానికి లేదా వినియోగానికి సురక్షితం కాని భవనాలను సమగ్రంగా గుర్తించి, వాటిలో నివసిస్తున్న లేదా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వీఎంసీ పరిధిలోకి రాని, ఇతర ప్రభుత్వ శాఖలు లేదా సంస్థల పరిధిలో ఉన్న ప్రమాదకర భవనాలకు సంబంధించి ఆయా శాఖలకు వెంటనే లేఖలు రాసి, భవనాల పరిస్థితిని తెలియజేయడంతో పాటు అందులో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి, అవసరమైన చర్యలు చేపట్టేలా సమన్వయం చేసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. అదేవిధంగా విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన ఎస్టేట్ ఆస్తుల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని వెంటనే తొలగించేందుకు (డిమాలిషన్) చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా శిథిలావస్థలో ఉన్న భవనాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్టేట్ ఆఫీసర్ ఏ శ్రీధర్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు పాల్గొన్నారు.

# క్యాడర్ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

## స్థానిక ఎన్నికలను యుద్ధంలా ఎదుర్కొందాం దేవినేని అవినాష్, జోగి రమేష్ జోగి రమేష్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**రానున్న స్థానిక ఎన్నికలకు వైఎస్ఆర్సిపి క్యాడర్ సిద్ధంగా ఉండాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు వైఎస్ఆర్సిపి



ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్. ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవినేని అవినాష్ హాజరయ్యారు. ముందుగా మహానత వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం జరిగిన సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలిపి లక్ష్యంగా క్యాడర్ పనిచేయాలని, అందరూ సమిష్టి కృషి చేసి ప్రజా వ్యతిరేక విధానాలను క్యాష్ చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త జోగి రమేష్ మాట్లాడుతూ ఒక యుద్ధంలాగా స్థానిక ఎన్నికలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రతి చోటా పోటీ చేయాలని అన్నారని కానీ ప్రతి చోట గెలిపే లక్ష్యంగా మనం పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రలాభాలకు లొంగకుండా పార్టీ కోసం నిలబడితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పిలిపించారు. స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు నియోజకవర్గ స్థాయి సమన్వ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. సమన్వయ కమిటీలో ఇబ్రహీంపట్నం నుండి ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి నియామకమయ్యారు.

### పరిశీలనకు 80 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కొండపల్లి పట్టణంలో 40 వార్డులకు ప్రతిపాదించిన మొత్తం 80 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలనార్థం నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయం, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం, విజయవాడ ఆర్డీవో కార్యాలయం నోటీసు బోర్డుల్లో ప్రదర్శించిన 80 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను పరిశీలించి, పోలింగ్ స్టేషన్ స్థానం, పరిధి, సౌకర్యాలు లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈ నెల 11వ తేదీ నాటికి మున్సిపల్ కమిషనర్ కు లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.


# క్యాడర్ స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

## స్థానిక ఎన్నికలను యుద్ధంలా ఎదుర్కొందాం దేవినేని అవినాష్, జోగి రమేష్ జోగి రమేష్

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**రానున్న స్థానిక ఎన్నికలకు వైఎస్ఆర్సిపి క్యాడర్ సిద్ధంగా ఉండాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు వైఎస్ఆర్సిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్. ఇబ్రహీంపట్నంలో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవినేని అవినాష్ హాజరయ్యారు. ముందుగా మహానత వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం జరిగిన సమావేశంలో దేవినేని అవినాష్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో గెలిపి లక్ష్యంగా క్యాడర్ పనిచేయాలని, అందరూ సమిష్టి కృషి చేసి ప్రజా వ్యతిరేక విధానాలను క్యాష్ చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త జోగి రమేష్ మాట్లాడుతూ ఒక యుద్ధంలాగా స్థానిక ఎన్నికలను ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రతి చోటా పోటీ చేయాలని అన్నారని కానీ ప్రతి చోట గెలిపే లక్ష్యంగా మనం పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రలాభాలకు లొంగకుండా పార్టీ కోసం నిలబడితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పిలిపించారు. స్థానిక సంస్థల ఎన్నికల పర్యవేక్షణకు నియోజకవర్గ స్థాయి సమన్వ కమిటీని నియమించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. సమన్వయ కమిటీలో ఇబ్రహీంపట్నం నుండి ఉమ్మడి జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి నియామకమయ్యారు.




# విజయ గణపతికి 630 కిలోల మహా లడ్డూ

## భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న మల్లయ్య స్వీట్స్ అధినేత వెంకటేశ్వరరావు ఆరు లక్షల యాభై వేల రూపాయల వ్యయంతో లడ్డూ తయారీ



**మచిలీపట్నం సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మంగినపూడి సముద్రతీరంలో కొలువుదీరనున్న 63 అడుగుల మట్టి విజయ గణపతికి అపురూపమైన నైవేద్యాన్ని సమర్పించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక మల్లయ్య స్వీట్స్ అధినేత, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గౌర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏకంగా 630 కిలోల భారీ లడ్డూను స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పించనున్నారు. సుమారు ఆరు లక్షల యాభై వేల రూపాయల వ్యయంతో ఈ మహా లడ్డూను తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈడేపల్లిలోని మల్లయ్య స్వీట్స్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సత్సంకల్పంతో మంగినపూడి సముద్రతీరంలో తొలిసారిగా 63 అడుగుల భారీ మట్టి విజయ గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల కోసం నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని చెప్పారు. వినాయక చవితి రోజైనా ఈనెల 14వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అప్పటినుండి 11 రోజులు పాటు ఈనెల 24వ తేదీ వరకు స్వామివారిని ఉపాలయాలను దర్శించేందుకు దాదాపు పది లక్షల మందిపైగా ఉభయ రాష్ట్రాల నుండి భక్తులు వస్తారని ఆశిస్తున్నట్లుగా తెలిపారు. స్వచ్ఛమైన శెనగపిండి, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో పవిత్రంగా 630 కిలోల మహా లడ్డూను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ లడ్డూను ఈ నెల 19వ తేదీ అర్ధరాత్రి నాటికి నగరం నుంచి భారీ ఎత్తున క్రేన్ సహాయంతో మంగినపూడి సముద్రతీరానికి చేర్చనున్నట్లు వివరించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తి చేతిలో లడ్డూను ఉంచి నైవేద్యంగా సమర్పించనున్నట్లు తెలిపారు. విజయ గణపతి విగ్రహంలోని స్వామివారి చేతిని రెండు వేల కిలోలకు పైగా బరువును మోయగలిగే విధంగా ప్రత్యేకంగా రూపొందించినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పదకొండు రోజుల పాటు మంగినపూడి సముద్రతీరంలో విజయ గణపతి కొలువుదీరనున్నారని చెప్పారు. ఈ పదకొండు రోజులూ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతూ, ప్రజలందరికీ సకల శుభాలను ప్రసాదించాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. విజయ గణపతి ఆశీస్సులతో మచిలీపట్నం ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని, బందరు ఓడరేవు పనులు త్వరగా పూర్తయి అభివృద్ధి వేగం పుంజుకోవాలని ఆకాంక్షించారు. పరిశ్రమలు తరలివచ్చి స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు లభించాలని కోరుకున్నారు. విజయ గణపతికి మహా లడ్డూను సమర్పించే భాగ్యం తనకు కల్పించిన మంత్రి కొల్లు రవీంద్రకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. గణనాథుని కృపతో మచిలీపట్నం నగర ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

# భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతెహా

## పేటలో ముగిసిన గంధ మహోత్సవం



**అనుమసముద్రంపేట సెప్టెంబర్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)** మండల కేంద్రమైన ఏఎస్ పేట లోని శ్రీ హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్ రసూల్ వారి 253 వ గంధ మహోత్సవం సందర్భంగా గురువారం తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో గంధ మహోత్సవాలు ముగిసాయి మహల్ నుంచి దర్గా సజ్జాదా నషీన్ షాగులాం నక్షబంద్ హఫీజ్ పాషా ఆధ్వర్యంలో గంధం గంధ కలశంలో కలిపారు. ముస్లిం పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఫకీరుల డప్పు వాయిద్యాలు, గాయకుల కీర్తనలు మధ్య శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాకు గంధం తీసుకువెళ్లారు. దర్గా వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక వద్ద మొదటగా శ్రీ హజరత్ ఖాజా నాయబ్ రసూల్ వారి జపమాలను భక్తులకు జునేద్ పాషా చూపించారు. భక్తులు ఏడాదికాలంగా ఎదురుచూస్తున్న వారు జపమాలను చూసి తరించారు. అనంతరం తహలీల్ ఫాతెహా చదివింపులు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు నదీమ్ సందానీ తదితరులు పాడిన శ్రీ హజరత్ వారి కీర్తనలు భక్తులను అలరించాయి. ఫకీర్లు చేసిన విన్యాసాలు చూసేవారిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా దర్గా సజ్జాద నషీన్ హఫీజ్ పాషా ఖత్మే ఖురాన్. చదివింపులు గావించారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు అనంతరం దర్గా లోపల ఉన్న ఖాజా నాయబ్ రసూల్ దొరసానమ్మల సమాధులపై గలేపు వస్త్రాలు, పూల దుప్పట్లు ఉంచి గంధం పూసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు

**ఎన్డీయే కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్.**

**అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ప్రత్యేక కౌంటర్ ను ఏర్పాటు చేశామని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ బీజేపీ ఎక్ భారత్ శ్రేష్ట్ భారత్ కన్వీనర్ పీయూష్ దేశాయ్ మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, జనసేన పార్టీ 42 వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పెన్షన్లు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వృద్ధులు వితంతువులు , ఒంటరి మహిళలు , దివ్యాంగుల వివరాలను తీసుకొని నమోదు చేస్తున్నామన్నారు. వారం రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. బీజేపీ సీనియర్ నాయకులు దుర్బేసుల హుస్సేన్ పాల్గొన్నారు.

# వర్షపు నీరు రహదారుల పైన నిలవకుండా చర్యలు



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం వర్షం కురిసిన నేపథ్యంలో పాలిక్లినిక్ రోడ్డు, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, నిర్మల కాన్వెంట్ రోడ్, ప్రాంతాలలో లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా డ్రెయిన్లు, కల్వర్టులు, క్యాచ్‌పిట్లు తదితరాలను నిరంతరం పరిశీలించి, ఎక్కడైనా అడ్డంకులు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని సూచించారు. నీటి నిల్వ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వర్షం కురిసిన వెంటనే నీటిని తొలగించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రహదారుల్లో నిలిచిన వర్షపు నీటిని ఎయిర్‌టెక్ మెషీన్లతో త్వరితగతిన తొలగించి, రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగరంలో వర్షాల సమయంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు నిరంతరం అందుబాటులో ఉంటుంరని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ వర్షపు నీటి తొలగింపు, డ్రెయినేజీ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కమిషనర్ అన్నారు. ఈ పర్యటనలు జోనల్ కమిషనర్ షమ్మీ, పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసంఎల్ ఓ సీ అందజేత




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్. ఓ. సి ) లను జారీ చేస్తున్నారు. ఎమ్మెల్యే , ఆదేశాలతో ఏపీ బీజేపీ ఎక్ భారత్ శ్రేష్ట్ భారత్ కన్వీనర్ పీయూష్ దేశాయ్, మాజీ కార్పొరేటర్లు యేదుపాటి రామయ్య , బుల్లా విజయ్ కుమార్, శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం చైర్మన్ పోతిన భేసు కంటేశ్వరుడు, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తో కలిసి అందజేశారు.. గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన ఒడుగు సునీత(39) ఫైబ్రోఅడెనోమా రొమ్ము గడ్డల సమస్యతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 3.68 లక్షల విలువైన ఎల్ ఓ సీ ను అందజేశారు.. త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

# విద్యార్థుల ఆకలి తీర్చే సేవా కార్యక్రమం

**పాండురంగ ఉన్నత పాఠశాలలో 700 మందికి పైగా విద్యార్థులకు భోజన పంపిణీ**



**మచిలీపట్నం సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థుల ఆకలి తీర్చేందుకు ప్రతి నెల నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మచిలీపట్నం చిలకలపూడిలోని పాండురంగ ఉన్నత పాఠశాలలో భోజన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 700 మందికి పైగా విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు నడికోట నగేష్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా భోజన పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పాండురంగ ఉన్నత పాఠశాలలో 700 మందికి పైగా విద్యార్థులకు భోజనం అందించినట్లు పేర్కొన్నారు. భోజనం ఎంతో రుచికరంగా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు భోజనం అందించిన నడికోట నగేష్, కృష్ణ ప్రసాద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు నడికోట నగేష్‌ను శాలువాతో సత్కరించారు.

# పండగ జరుపుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

**గణేశ్ ఉత్సవాల్లో సంప్రదాయానికి ప్రాధాన్యత ఇవ్వాలి-సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు**




**జగ్గయ్యపేట సెప్టెంబర్ 10 (వార్తప్రభ)** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించాలని క్యాప్కో రాష్ట్ర ఉపాధ్యక్షులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు అధిక శబ్దానికి దూరంగా ఉండి, పండుగ సంప్రదాయాలు, ప్రజల ప్రశాంత జీవనం రెండింటినీ గౌరవించాలని గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ ద్వారా అధిక శబ్దాన్ని వినియోగించడం వల్ల వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పండుగ అంటే ఆనందాన్ని పంచుకోవడం కానీ, ఇతరులకు అసౌకర్యం కలిగించడం కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. డీజేలకు బదులుగా సంప్రదాయ సన్నాయి మేళం, పరిమిత శబ్దంతో సాధారణ మైకులు వినియోగించడం ద్వారా ఉత్సవాలకు మరింత సాంస్కృతిక శోభను తీసుకురావచ్చని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా వీలైనంత వరకు మట్టితో తయారు చేసిన పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. మండపాల ఏర్పాటు సమయంలో రహదారులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, అత్యవసర సేవలకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుగల నిర్వహణలో భక్తి, సంప్రదాయం, పర్యావరణం, ప్రజా ఆరోగ్యం---ఈ నాలుగు అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్లు, అధిక శబ్దంతో కూడిన కార్యక్రమాలకు అనుమతి లేకుండా సంబంధిత అధికారులు నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కర్లపాటి కోరారు. "డీజే శబ్దంతో పండుగ గొప్పది కాదని .. భక్తి, సంప్రదాయం, ప్రశాంతతతో జరిగే ఉత్సవమే నిజమైన పండుగన్నారు. డీజే సౌండ్ వద్దు.. సన్నాయి మేళం ముద్దు" అని ఆయన పేర్కొన్నారు

# గంజాయి గుట్టు రట్టు.. ముగ్గురు అరెస్ట్

**ఒడిశా నుంచి రైలులో 2 కిలోలు తరలింపు..**

**1.360 కిలోలు స్వాధీనం**

**పాడుబడిన భవనంలో పంచుకుంటుండగా పోలీసుల మెరుపుదాడి**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 10 :(వార్త ప్రభ ప్రతినిధి)** గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. 'ఈగల్ ఛాలెంజ్'లో భాగంగా కొత్తపేట పోలీసులు దాడి చేసి గంజాయి ముఠా గుట్టురట్టు చేశారు. ఇస్లాంపేటలోని దళాయి వారి వీధిలో పాడుబడిన భవనంలో గంజాయిని పంచుకుంటున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 1.360 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం కొత్తపేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ ఏడిసిపి గున్నం రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అందిన పక్కా సమాచారంతో కొత్తపేట పోలీసులు దాడి చేశారని వెల్లడించారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ అస్టర్ (21), భవానిపురానికి చెందిన ఆటో డ్రైవర్ కట్టా ప్రసాద్ (24), న్యూ ఆర్. ఆర్. పేటకు చెందిన షేక్ మహమ్మద్ ఇబ్రహీం ఖలీల్ (20) పట్టుబడ్డారని మీడియాకు తెలియజేశారు . విచారణలో అస్టర్ సూచనల మేరకు ప్రసాద్, ఖలీల్‌లు ఒడిశాలోని రాయఘడ్‌కు రైలులో వెళ్లి 2 కిలోల గంజాయిని కొనుగోలు చేసి విజయవాడకు తరలించినట్లు పోలీసులు గుర్తించారని పేర్కొన్నారు . కొంత గంజాయిని వినియోగించిన అనంతరం మిగిలినదాన్ని పంచుకునే ప్రయత్నంలో పోలీసులకు చిక్కారని తెలిపారు . అరెస్టయిన కట్టా ప్రసాద్‌పై గతంలోనూ నేరచరిత్ర ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు . 2020లో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని బెదిరించి రూ. 500 లాక్కున్న కేసులో నిందితుడిగా ఉన్నట్లు వెల్లడించారు. ముగ్గురిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. గంజాయి విక్రేతలు, వినియోగదారులపై సమాచారం అందిస్తే నగదు బహుమతులు అందిస్తామని, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని గుణ్ణం రామకృష్ణ కోరారు. సమావేశంలో వెస్ట్ ఏసిపి దుర్గారావు 2 టౌన్ సిఐ కొండలరావు పాల్గొన్నారు

# దేవుడు మాన్యం భూములు గాలికి వదిలి ఇనాం భూములపై నిషేధమా?

**శివాలయం మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాదిరాజు కేశవరావు**

**జగ్గయ్యపేటలో 4వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 10 (వార్తప్రభ)** దేవుడు మాన్యం భూములు ఆక్రమిస్తుంటే పట్టించుకోని ప్రభుత్వం రైత్వారి పట్టాలు పొంది 50 సంవత్సరాలుగా అనుభవిస్తున్న భూములపై నిషేధం విధించడం ఎక్కడ న్యాయమని శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మాదిరాజు కేశవరావు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూబాధిత సంఘం ఏర్పాటు చేసిన నాలుగో రోజు దీక్ష శిబిరాన్ని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్బాస్ అలీ, కే కోటేశ్వరరావు లు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ దేవుడు మాన్యం భూములు ఆక్రమించుకొని అనుభవిస్తున్న వారిని వదిలేసి చట్టబద్ధమైన హక్కులు పొందిన సర్వీస్ ఇనామ్ దారులను దోషులుగా నిలబెడుతూ వారి భూములపై నిషేధం విధించడం మన ప్రభుత్వాలకే సాధ్యమైందని విమర్శించారు. ఇనాం భూముల పై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ నేతలు అబ్బాస్ ఆలీ, కోటేశ్వరరావు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నేత ఎం వెంకటేశ్వరరావులు, గంటా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏ మాత్రం ఆర్థిక భారం లేకుండా పరిష్కరించే అవకాశం ఉన్న ఇనాం భూ బాధితుల సమస్యను పరిష్కారం చేస్తూ ఆ భూముల్లో లావాదేవీలు జరిగి కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లు సమస్యపై దృష్టి సారించాలని వారు కోరారు. నాలుగో రోజు దీక్షలో రంగాపురం నాగేశ్వరరావు, వరగాని సుదాకర్, మేకల గురు ప్రసాద్, కే చంద్ర శేఖర్, పీ. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

**నోటికి నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్ష** జగ్గయ్యపేట ఇనాం భూబాధితుల రిలే నిరాహార దీక్ష శిబిరంలో బాధితులు నోటికి నల్ల రిబ్బన్ ధరించి వినూత్నంగా మౌనంగా నిరసన తెలిపారు. పదేళ్లుగా తమ భూములను పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని ఎన్నోసార్లు ప్రభుత్వాలకి విన్నవించినా, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని, తమ భూములపై తమకు హక్కు కల్పించే వరకు విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇనాం బాధిత సంఘం ప్రతినిధులు గద్దె సుదీర్, చింతపల్లి ప్రసాద్, యలవర్తి అచ్యుత రామయ్య, కాకరపర్తి వెంకట రమేష్, కే ప్రసాద్, యలవర్తి శరత్ తదితరులు పాల్గొన్నారు.

# నాయుడమ్మ స్మారక పురస్కారంతో డా. గల్లా రామచంద్ర నాయుడుకు ఘన సత్కారం



**తిరుపతి, సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక చైర్మన్ డా. గల్లా రామచంద్ర నాయుడుకు ప్రతిష్ఠాత్మక "పద్మశ్రీ డా. యలవర్తి నాయుడమ్మ స్మారక పురస్కారం--2026" లభించింది. గురువారం తెనాలిలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ పురస్కారాన్ని డా. గల్లా రామచంద్ర నాయుడుకు అందజేశారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త పద్మశ్రీ డా. యలవర్తి నాయుడమ్మ జయంతిని పురస్కరించుకుని ఏటా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఈ స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. పారిశ్రామిక రంగంలో అమర రాజా సంస్థను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లో డా. గల్లా రామచంద్ర నాయుడు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ ఏడాది పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, డా. యలవర్తి నాయుడమ్మ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న వారిని గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పురస్కారాలు సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, డా. యలవర్తి నాయుడమ్మ పేరుతో అందజేస్తున్న ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందన్నారు. సమాజ అభివృద్ధి కోసం తన వంతు కృషిని నిరంతరం కొనసాగిస్తానని తెలిపారు. డా. యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాథ బాబు అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ఆహ్వానితులు పాల్గొన్నారు. పురస్కారం లభించడంపై అమర రాజా కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

# వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలి..

**- ఆర్టీసీ విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఆకాంక్ష..**



**ఏలూరు, సెప్టెంబర్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కలియుగ దైవం, కోనసీమ తిరుపతి, డా. బీ. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని తన పుట్టినరోజు సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు, తన సతీమణి రెడ్డి అనురాధ తో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. తొలుత స్వామి వారి దర్శనానికి వచ్చిన అప్పలనాయుడు దంపతులకు వేద పండితులు ఘన స్వాగతం పలికారు.. అనంతరం స్వామి వారి సన్నిధిలో వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు గారు మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా కలియుగ దైవం వాడపల్లి లో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగిందన్నారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సస్యశ్యామలంగా పాలించాలని ఆశయంతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్న సంకల్పంతో పూజలు నిర్వహించామన్నారు.. ఆ వేంకటేశ్వర స్వామి వారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, ఆ స్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు శాంతి సౌభాగ్యం కలగాలని రెడ్డి అప్పలనాయుడు ఆకాంక్షించారు..

# 72 గంటల్లో ఆలయ చోరీ కేసు ఛేదన

**రూ.15 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం**



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 10 (వార్తప్రభ)** ఎన్‌టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాల గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 72 గంటల్లోనే ఛేదించి, రూ. 15 లక్షల విలువైన పూర్తి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించడం ద్వారా నిందితుల కదలికలు, వారు ఉపయోగించిన వాహనం తదితర వివరాలను పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేసి, పక్కా సమాచారంతో కోదాడ శివారు వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో కారం సాంబయ్య (28), దేరంగుల మల్లేష్ (36), బత్తుల కోటయ్య అలియాస్ కోటేశ్వరరావు (29) ఉన్నారు. నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన మారుతీ సుజుకీ ఫ్రాంక్స్ కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా ఉపయోగపడుతున్నాయని పోలీసులు తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే సుమారు 13,000 అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరం జరిగిన ప్రదేశంలోనే కాకుండా, నిందితులు వచ్చిన మార్గం, వెళ్లిన మార్గం, ఉపయోగించిన వాహనం, వారి కదలికలను కూడా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆలయ చోరీ కేసులో కూడా సీసీ కెమెరాల దృశ్యాలు దర్యాప్తుకు ఎంతో ఉపయోగపడి, నిందితులను త్వరగా గుర్తించి పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. గ్రామాలు, వ్యాపార సముదాయాలు, దేవాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరం జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు పోలీసులకు ప్రజల సహకారం లభిస్తుందని అధికారులు తెలిపారు. రూరల్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్ ఆధ్వర్యంలో, నందిగామ ఏసీపీ సి. హెచ్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసు బృందాలు సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి కేసును ఛేదించాయి. కేసును 72 గంటల్లో ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీసు కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# కళాశాల విద్యార్థులకు ఎస్ఐ అయ్యప్ప కీలక సూచనలు

**ప్రభుత్వ కళాశాల ప్రెషర్స్ డే లో పాల్గొన్న ఎస్ఐ అయ్యప్ప**

**ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవర్చుకోవాలి... ప్రిన్సిపల్ లక్ష్మీజ్ఞానేశ్వరి**



**చేజర్ల సెప్టెంబర్ 10 (వార్తాప్రభ)** చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేజర్ల ఎస్ఐ అయ్యప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి ఈరోజు మనం చేసే పనిని బట్టి రేపటి మన భవిష్యత్తు నిర్ణయించబడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని మరియు సక్రమైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే. లక్ష్మీజ్ఞానేశ్వరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ముందు క్రమశిక్షణను అలవర్చుకోవాలని దానితో పాటు కష్టపడి చదివి మంచి స్థాయికి వెళ్లాలని మీ తల్లిదండ్రులకు మీకు పాఠాలు బోధించిన అధ్యాపకులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పెడన గూడూరు మండలాల్లో రెండవరోజు పోషణ మాసోత్సవం



**పెడన,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** జాతీయ 9 వ పోషణ మాసం సందర్భంగా గురువారం నాడు గూడూరు మండలం తరకటూరు గ్రామంలో జరిగింది. సెప్టెంబర్ 9నుండి అక్టోబర్ 8 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ పరిధిలో హైస్కూల్ లో పోషకాహార మాసోత్సవం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సిడిపిఓ గ్లోరీ మాట్లాడుతూ ఆహారంలో తీసుకోవలసిన పోషక విలువల గురించి వివరించారు. అలాగే మల్లవోలు సెక్టార్ సూపర్వైజర్ రేవతి కూడా పలు విషయాలపై అవగాహన కల్పించారు. స్కూల్ టీచర్స్ అరుణ డాక్టర్ రూపశ్రీ అంగన్వాడి టీచర్స్ హెల్త్ డిపార్ట్మెంట్ కి సంబంధించిన ఆశాస్ ఏఎన్ఎమ్స్ పాల్గొన్నారు. అలాగే కంకటావ గ్రామంలో జరిగిన కార్యక్రమం లో సూపెర్వైజర్ ఉషశ్రీ అంగన్వాడి కార్యకర్తలు స్వాతి అరుణ కవిత ఆశ వర్కర్లు పాల్గొన్నారు. పెడన పట్టణంలోని 20 21 వార్డులలో అరవ గూడెం కొత్తపేట రామలక్ష్మి కాలనీ బ్రహ్మపురం అంగన్వాడి కేంద్రాలలో సూపర్వైజర్ పిట్ల కల్పవల్లి ఆధ్వర్యంలో పోషణ మాస ఉత్సవాన్ని నిర్వహించారు.

# వీస్టాండ్4యూ టెక్నాలజీస్ డ్రైవ్‌లో 12 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల ఎంపిక



**గుడివాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** గుడివాడ వి.కె.ఆర్ & వి.ఎన్.బి ఇంజనీరింగ్ కళాశాల లో వీస్టాండ్4యూ టెక్నాలజీస్, బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు 200 మంది విద్యార్థులు హాజరుకాగా, నాలుగు రౌండ్ల ఇంటర్వ్యూల అనంతరం 12 మంది విద్యార్థులు రూ.3.5 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు అందిస్తున్న టెక్నికల్, వెర్బల్, అప్టిట్యూడ్, హెచ్‌ఆర్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఈ విజయానికి దోహదపడిందని కళాశాల తెలిపింది. సంస్థ హెచ్‌ఆర్ ప్రతినిధి అనుపమ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి. కల్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి. ప్రసాదరావు విద్యార్థులను అభినందించారు. శిక్షణ మరియు నియామకాల అధికారి డాక్టర్ ఎన్. ధనుంజయరావు మాట్లాడుతూ నిరంతర శిక్షణ విద్యార్థుల ప్లేస్‌మెంట్ విజయానికి దోహదపడుతోందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, సంస్థ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# కృత్తివెన్నులో 19 ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న లారీ పట్టివేత...

## నలుగురు అరెస్ట్..



**కృత్తివెన్ను,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో అక్రమంగా తరలిస్తున్న 19 ఎద్దులతో కూడిన లారీని కూటమి, విశ్వహిందూ పరిషత్ నాయకులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి నెల్లూరు జిల్లాకు ఎద్దులను తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని అడ్డుకుని అందులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఎద్దులతో సహా లారీని కృత్తివెన్ను పోలీసులకు అప్పగించారు. కృత్తివెన్ను ఎ స్ ఐ పైడి బాబు కేసును నమోదు చేసి 19 ఎద్దులు ఉన్న లారీని అందులో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని, లారీలను తలకటూరులోని గో సంరక్షణ కేంద్రానికి తరలించామని తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా గోవులను తరలించడం వధించడం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పైడి బాబు హెచ్చరించారు.

# వెల్లివిరిసే పచ్చదనమే పుడమికి శ్రీరామరక్ష....

## మొక్కలు నాటిన ఎంఈఓ రవీందర్, హెచ్‌ఎం బాబూరావు



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** భౌగోళిక వెచ్చదనం వలన సునామీలు, ఎల్నినోలు వంటి వైపరీత్యాలు ఎదుర్కొంటున్న పుడమికి మనం నాటే మొక్కలే శ్రీరామరక్ష అని పెనుగంచిప్రోలు ఎంఈఓ డి రవీందర్, బాలికోన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబు రావు అన్నారు. గురువారం నాడు పెనుగంచిప్రోలు స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. గౌరవ జిల్లా కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆదేశాల మేరకు పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని ఎంఈఓ రవీందర్ అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ కార్యక్రమం కింద పథకాలు వేగవంతం చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రతి పాఠశాలకు ప్రణాళిక ప్రకారం మొక్కలు సరఫరా చేసి, నాటిన మొక్కలను ట్యాగింగ్ చేయడం జరుగుతుందని రవీందర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముక్కా సత్యనారాయణ, వేగినేటి వెంకటరమణ, సంతోష భారతి, ప్రమీల, స్వర్ణలత, స్వాతి శిల్ప, శ్రీదేవి, సి ఆర్ పి లు జొన్నలగడ్డ చిన్న గోపాలరావు , సాంబశివరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు మద్దతుగా నిలవాలి..

- 25 కుటుంబాలకు రూ. 10.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము





**గుడివాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** కష్టాల్లో ఉన్న ప్రజలకు సహాయంగా ఆదుకుంటున్న సీఎం చంద్రబాబుకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. స్థానిక ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని 25 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ. 10.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాము లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఒక్క గుడివాడ నియోజకవర్గంలోనే ఇప్పటివరకు రూ.7.11 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేకాదు కోట్లాది రూపాయల ఎల్ఓసిలు కూడా మంజూరు చేయించామని ఎమ్మెల్యే రాము చెప్పారు. అవసరంలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాత్రగడ్డ రవికుమార్, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పిన్నమనేని బాబ్జి, బొంబాయి శ్రీను, యార్లగడ్డ సుధారాణి, సీతయ్య, సింగాల రాధాకృష్ణ, పులవర్తి డేవిడ్, గుత్తా చంటి, కొడాలి రాజా, పైడిముక్కల వంశీ, ద్వారక, కోడూరి ప్రభు, మల్లికా బేగం, కర్ణాకర్ రావు, కమలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# బాబు వస్తే జాబ్ అన్నారు.. జాబ్ అడిగితే అరెస్టులా ?

## – కూటమి ప్రభుత్వంపై షేక్ సయ్యద్ ఫైర్



**గుడివాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** "బాబు వస్తే జాబ్ వస్తుందని ఎన్నికల ముందు హామీ ఇచ్చి, ఇప్పుడు ఉద్యోగం అడిగితే అరెస్టులు చేస్తారా? ఇదేనా కూటమి పాలన?" అని వైఎస్సార్సీపీ ముస్లిం సంచారజాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి అధినేత చంద్రబాబు నాయుడు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా హామీ అమలులో పురోగతి లేదని విమర్శించారు. పోలీస్ శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా పరిమిత పోస్టులను మాత్రమే భర్తీ చేసి నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. పోలీస్ ఉద్యోగాలకు వయోపరిమితి సడలించి ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఱఖీ×,ౢా×ాఖీ, ాఖీ× తదితర విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు కాకినాడలో సోమవారం నిరుద్యోగులు శాంతియుతంగా ఆందోళన చేపట్టారని, వారిపై పోలీసులు దాడులు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని మండిపడ్డారు. "ప్రశ్నిస్తే కేసులు, నిరసన తెలిపితే అరెస్టులా? ఇది ప్రజాస్వామ్యమా, పోలీసు రాజ్యమా? ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత ల కూటమి ప్రభుత్వం రాజ్యాంగ పాలన చేస్తుందా, రెడ్ బుక్ పాలన చేస్తుందా?" అని ప్రశ్నించారు. అరెస్టులతో నిరుద్యోగుల పోరాటాన్ని ఆపలేరని, ఇచ్చిన హామీలను నెరవేర్చి, ఆందోళనకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల న్యాయమైన పోరాటానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని సయ్యద్ స్పష్టం చేశారు.

# జకార్ రాజు 26వ వర్ధంతి సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం

- 150 మందికి కంటి పరీక్షలు.. 100 మందికి ఉచితంగా కళ్ళ అద్దాలు
- పేదలకు వైద్య సేవలు అందించడం అభినందనీయం: ప్రజా ప్రతినిధులు



**అమలాపురం,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** జంపన సూర్యనారాయణ రాజు (జకార్ రాజు) 26వ వర్ధంతిని పురస్కరించుకుని జకార్ రాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో, ట్రస్టు అధినేత, అమలాపురం లయన్స్ క్లబ్ సభ్యులు, రీజియన్ చైర్పర్సన్ లయన్ జంపన సుమన్ వర్మ ఆర్థిక సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనిధి ఎమర్జెన్సీ హాస్పిటల్, విష్ణు దంత వైద్యశాల వారి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, గుండె పరీక్షలు, ఈసీజీ , కంటి పరీక్షలు, దంత పరీక్షలు, చర్మం--ముక్కు--గొంతు పరీక్షలు, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వైద్యం, న్యూరో సర్జరీ తదితర విభాగాల్లో వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను కూడా అందించారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో సుమారు 100 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. అవసరమైన కళ్లద్దాలను త్వరలోనే జకార్ రాజు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి, శాసనసభ్యులు అయ-ంతాబత్తుల ఆనందరావు పాల్గొని వైద్య శిబిరాన్ని అభినందించారు. అలాగే రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, సొసైటీ అధ్యక్షులు ఆకేటి పెద్ద, 316 మల్టిపుల్ జీఎంటి పాస్ట్ మల్టిపుల్ చైర్పర్సన్ లయన్ అనిల్ జైన్, 316బి లయన్స్ సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మెట్ట రాధా సరస్వతి, 316బి జీఏటి లీడర్ లయన్ వినీతా రెడ్డి, అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ మద్దెల వెంకటేశ్వరరావు, కార్యదర్శి లయన్ పూజ అనిల్ జైన్, కోశాధికారి లయన్ జంపన శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, లయన్స్ క్లబ్ నాయకులు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచిత వైద్య సేవలు అందించడం, అవసరమైన మందులు, కళ్లద్దాలు అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జకార్ రాజు సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ చారిటబుల్ ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, ప్రజలు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని విజయవంతం చేశారు.

# ఆడపిల్లలను చదివిద్దాం - బాల్య వివాహాలను అంతం చేద్దాం

- బాలలపై వేధింపుల నివారణకు సామాజిక చైతన్యం అవసరం
- రెడ్‌క్రాస్ అవగాహన సదస్సులో వక్తల పిలుపు






**విజయవాడ, సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** బాలలపై జరుగుతున్న వేధింపులు, దోపిడీ, హింసను అరికట్టడంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రసాదంపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో గురువారం బాలలపై వేధింపులు, బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డా. జి. సమరం మాట్లాడుతూ యువత, విద్యార్థులు సమాజంలో మార్పునకు శక్తివంతమైన రాయబారులుగా నిలవాలని కోరారు. బాలలపై వేధింపులు, బాల్య వివాహాల వంటి సమస్యలను కేవలం చట్టాలతోనే పూర్తిగా నిర్మూలించలేమని, సామాజిక చైతన్యం, విద్య, కుటుంబ బాధ్యత కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. "ఒక బాలిక చదువు కొనసాగితే ఒక కుటుంబం మాత్రమే కాదు.. ఒక తరం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. ముఖ్య వక్తగా పాల్గొన్న వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డా. బి. కీర్తి మాట్లాడుతూ బాలలపై జరిగే శారీరక, మానసిక, లైంగిక వేధింపులు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. పిల్లలను బెదిరించడం, భయపెట్టడం, అనుచితంగా ప్రవర్తించడం, లైంగిక వేధింపులకు గురిచేయడం వంటి ఘటనలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదన్నారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని, వారు సమస్యలను చెప్పినప్పుడు నిందించకుండా ప్రేమతో మాట్లాడి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. వాసవ్య మహిళా మండలి 'యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్' డైరెక్టర్ కె. విజయ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల చదువును మధ్యలోనే నిలిపివేయడంతో పాటు వారి ఆరోగ్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు అవకాశాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని చెప్పారు. చిన్న వయసులో వివాహం చేయడం కంటే బాలికలకు మంచి విద్య అందించి స్వయం ఆధారితులుగా తీర్చిదిద్దడం కుటుంబానికి, సమాజానికి, దేశానికి మేలు చేస్తుందన్నారు. బాల్య వివాహం కేవలం కుటుంబానికి సంబంధించిన అంశం కాదని, అది బాలల హక్కులు, భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక సమస్య అని విజయ పేర్కొన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, సామాజిక ఒత్తిళ్లు, మూఢనమ్మకాలు, బాలికల భద్రతపై తల్లిదండ్రుల్లో ఉండే భయాలు బాల్య వివాహాలకు కారణమవుతున్నాయని, వీటిని అధిగమించేందుకు సమాజం సమష్టిగా కృషి చేయాలని కోరారు. తమ స్నేహితులు లేదా పరిచయస్తుల్లో ఎవరైనా వేధింపులు లేదా బాల్య వివాహం వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు గుర్తిస్తే ఉపాధ్యాయులు, విశ్వసనీయ పెద్దలు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని విద్యార్థులకు సూచించారు. యువతలో మానవతా విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించడంలో భాగంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు టి. విష్ణుప్రియ, హేమలతతో పాటు సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# నందిగామ నియోజకవర్గ ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలి

## –జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** "ఒక నెల – ఒక నియోజకవర్గం–నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సెప్టెంబర్ 11వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. నందిగామ మధిరరోడ్డులోని ఆర్.ఎస్ గార్డెన్స్ నందు ఉదయం 10.00 గంటల నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని ప్రజల నుంచి అధికారులు అర్జీలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. నందిగామ నియోజకవర్గ ప్రజలు ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ కోరారు.

# సీనియర్ రాజకీయ నాయకుడు యం డి మతిన్ మృతి



**పెడన,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర డ్రైనేజీ బోర్డు మాజీ డైరెక్టర్ పీసీసీ సభ్యులు ఎం.డి. మతీన్ మృతి చెందారు ఆయన కాంగ్రెస్ పార్టీలో కొన్నేళ్ల పాటు క్రియాశీలక పాత్ర పోషించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు దివంగత కావూరి సాంబశివరావు కు ఈ ప్రాంతంలో మతీన్ ముఖ్య అనుచరునిగా కొనసాగారు. వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ మాజీ మంత్రి పేర్ని నాని జయసుధ దంపతులు ఆర్ ర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు బుల్లయ్య బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు పూలబాబు కటకం ప్రసాద్ బళ్ళ గంగయ్య అయూబ్ ఖాన్ వాహబ్ ఖాన్ బందరు అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్ తదితరులు మతీన్ నివాసనికి చేరుకొని శ్రద్ధాంజలి ఘటించారు.

# 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు ప్రారంభం



**గుడివాడ,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** గుడివాడ అర్బన్ పౌష్టికాహార మాసోత్సవాలు ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో రెండో రోజైన గురువారం స్థానిక సంఘం స్కూల్ నందు గల అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఓ జయంతి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలని తల్లులకు వివరించారు. అలాగే ఎంఎస్‌కె రమాదేవి, ఏఎన్ఎం వనజ లు మాట్లాడుతూ తల్లులకు తగిన సలహాలు, సూచనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు టి. దుర్గాకుమారి, ఆర్ రాజ్యలక్ష్మి, ఎండి నగీనా, వి. విజయలక్ష్మి, ఎలిజిబెత్, ఆశా వర్కర్లు మరియు ఆ ఏరియాలోని గర్భవతులు, బాలింతలు మరియు పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్, హెల్మెట్, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపొద్దు



**తిరువూరు,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సెక్టార్–2 ఎస్సై రాజు హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా, వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనదారులకు సూచనలు చేశారు. వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై రాజు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ఆయన కోరారు.

# శాకాంబరి దేవిగా దర్శనం ఇచ్చిన శ్రీ కోట మైసమ్మ తల్లి....



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు శాలి గడ్డ సెంటర్ లో ఉన్న శ్రీ కోట మైసమ్మ తల్లి దేవస్థానంలో శాకంబరి అలంకరణ తో అమ్మ వారు గురువారం భక్తులకు దర్శనం ఇచ్చారు, ఈ కార్యక్రమంలో మహిళలు దేవరశెట్టి వెంకటలక్ష్మి చెన్న సీతమ్మ వల్లం కంటి కళావతి శ్రీలక్ష్మి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు శాకాంబరి అలంకరణలో దర్శనం ఇస్తున్న కోట మైసమ్మ తల్లి ని భక్తులు దర్శనం చేసుకున్నారు..

